


పడుకునే అతని బుజాన్ని ఒక చేత్తో పట్టుకొని వూపుతూ "సౌఖ్యానికన్నా మానవ జీవితంలో కోరదగింది యింకొకటి లేదు. సౌఖ్యానికి, ఆనందానికి; గౌరవం, అభిమానం అడ్డుపడవు. సౌఖ్యంముందు, స్వార్థం లేని ఆనందంముందు, గాఢమైన కోరిక ముందు అదే చెబుతుంది ఎటువంటప్పుడు ఏంచేయాలో, ఏ అపాయంలో ఎలా నడుచుకోవాలో, ఈ వాదన, భయం అనవసరం. మధురాతి మధురమైన పాయసం తాగుతూ, తీయని మామిడిపండు తింటూ, ఇది ఎలా వొచ్చింది, దేంతో చేశారు, ఈ తీయదనం ఎలాపుట్టింది, అని ఆలోచిస్తారా? ఇదంతా అనవసరం. ఆయనగారు కొట్టనీ, చీల్చనీ, ఆపదలమీద ఆపదలు దొర్లించనీ, జీవితం నాశనమైపోనీ, ఇటువంటి దివ్యానుభవాల్ని చేతులారా పాడుచేసుకుని, ఆయనగారికి తెలుస్తుందనీ, పాపమనీ, పుణ్యమనీ, అగౌరవమనీ, పెద్దల నీతిమాటలకు భయపడి— చేతులారా బతుకును, ఆనందాన్ని, సౌఖ్యాన్ని దుర్భరంచేసుకోనా?" అన్నాను.

మాట్లాడలేదు.

కోరికనేది కలగకుండా వుండాలేగాని, కలిగింతర్వాత ఆడదానిముందు మగవాడి నిశ్చలత, నిప్పుమీది వెన్నలా కరిగిపోతుందనే మాట గుర్తుకొచ్చింది.

వెంటనే శివరామారావుని నా దగ్గరకు లాక్కొని, ఆ భుజాల్ని, చేతుల్ని, ముఖాన్ని, ఆ లేత పెదవుల్ని ఎన్నిసార్లో ముద్దుపెట్టుకున్నాను. ఇంకా దగ్గరగా హృదయానికి అదుముకుని పెదిమల్ని అతని నోటికి అందిచ్చాను.

బలంగా చేతులు వెనక్కునెడుతున్నా, ఆ మనసూ, హృదయం మెల్లిమెల్లిగా మెత్త

బడినయ్! తీగల్లా నామెడచుట్టూ పొడుగాటి మున్నని చక్కనిచేతులు పెనవేసుకున్నాయి. అతలని రెండుచేతుల్లో పట్టుకుని నారొమ్ము కి అదుముకున్నాను.

నిశ్శబ్దంగా పావుగంట గడిచింది. చిన్న ల్లాడిలా రొమ్ముల మీద తలపెట్టిపడుకున్న ఆ మొహాన్నిచూశాను, కళ్లల్లో, మొహంలో- అగ్నిజ్వాలలు వురుకుతున్నాయ్. ఎరుపెక్కిన కళ్ళూ, వేడివేడి నిశ్వాసాలు, మనసుని ఎక్కడికో లాక్కుపోయినయ్.

క్రొద్దిగా జరిగి "పడుకో—" అన్నాను.

చేతితో ఒక్కతోపుతోసి "మద్రాసు రేడియో స్టేషనికి నాటికరాయాలి. ప్రోగ్రాం డైరెక్టరుగారు ఉత్తరంరాశారు. ఈరాత్రికి నన్ను వొంటరిగా వుండనీయండి. తెల్లవారే టప్పటికల్లా రాసేస్తాను. అప్పుడే రెండు దాటింది" అంటూ లేచి కూచున్నాడు.

నేనిక ఏమీ మాట్లాడలేకపోయాను. అతని ముఖవైఖరి కొత్తగావుంది. కిటికీ లోంచి వచ్చే చల్లనిగాలిలో అక్రాపు వెంట్రు కలు ఎగురుతున్నాయి. నా అంతట నేను రెచ్చగొట్టి, కోరి దగ్గరికి లాక్కుంటున్న కొద్దీ, స్త్రీ సౌఖ్యాన్నీ, ఆనంధాన్నీ, మాధు ర్యాన్నీ దూరంగా నెడుతూ—నీతులకి, ధర్మాలకి, గౌరవానికి దాసోహమై ప్రపం చాన్నివుద్ధరిస్తున్నట్లు, రేడియోనాటికవంకతో దూరదూరంగా జరుగుతూ, కిటికీలోంచి దూరి మీదపడుతున్న వెండితొడుగులాంటి వెన్నెల కలిగించే ఉద్రేకానికి లోబడకుండా ఆదుర్దాపడుతూ లేచికూర్చుని ఏదో ఆలో చిస్తూ, శతమహామునిలా కూర్చున్న శివ రామారావుని ఆశ్చర్యంగా చూసాను.

ఏనాటికన్నా ఏదన్నా అర్థమవుతుం దేమోగాని, అతనిమనసులోని సంగతి తెలుసుకునేశక్తి నాకులేదనుకుంటాను.

కిటికీలోంచి వెన్నెలదూరి మంచంమీద పడుకున్న నాశరీరంమీదపడి మెరుగులు పెడుతూంది. వూపిరి పీలుస్తున్నకొద్దీ ఉబుకు తున్న రొమ్ములన్నీ, చెంపలన్నీ చూస్తూ శివ రామారావు అలానే కూచున్నాడు.

నిర్భాగ్యుడు ఇంకా కాగితాలు తీసుకు ఆలోచిస్తూ రాసేందుకు అలావే కూచు న్నాడు. చలనంలేని ఆమొద్దుశరీరం ఉద్రేక పడ లేదు. కిటికీలోంచి వెన్నెలమీదపడి మనసుని కలతపెడుతున్నకొద్దీ, అందమైన ఈరాత్రి వృధాగాపోతుందనే దిగులుతో, బాధతో లేచి—అతనిమీదకు వొంగి, తిరిగి రెచ్చగొట్టాలని చూశాను.

"క్షమించండి"

అతని గొంతూ, ఆమాటలూ ఎంతో వినయంగా, జాలిగా, బాధను సూచించినయ్. మెదలకుండా నేనలానే ఏమేమో ఆలోచిసూ రెప్పలు మూసాను.

## 7

ఉదయం లేచేప్పటికి, శివరామారావు లేడు. ఆఫీసుకి వెళ్లాడను కుంటాను. విద్ర లేక మనసంతా అందోళనగా వున్నా— మస్తాబై అతని గదిలోకి వెళ్లాను. కిటికీ లోంచి ఉదయపు బంగారు సూర్య కిరణాల కాంతికి మురిసిపోతూ హాయిగా వూగుతున్న కొబ్బరి చెట్లమీదిగాలి మెల్లిగా వస్తూంది. గోడకి తగిలించిన నిలువుటద్దం—కళ్ళల్లోని ఎర్రటి జీరల్ని — బరువైన కనురెప్పల్ని, కణతలమీదపడి ఆడుకుంటున్న వుంగరాల జుట్టు నీ చూపిస్తోంది. పెదిమలమీద సగం

కాలి ఆరిపోయిన అగరువత్తులు, శేస్మీ పట్టుతో మెరిసే దిళ్లకింది తెల్లని పక్కా— రాత్రి జరిగిన సంఘటనని కళ్ళముందు పెట్టి నయ్.

వెళ్ళి మంచంమీద కూర్చున్నాను.

ధనం, ఐశ్వర్యం, సుఖం — ఆనందం, ప్రపంచంలోకల్లా విలువగల విషయాలు. మానవ జీవితంలో సుఖమనేది, ఆనంద మనేది గొప్ప అదృష్టం: ఆ అదృష్టాన్ని అనుభవించడం చేతకాక, సుఖాన్ని చేజే తులా పాడుచేసుకొనే జన్మ వొట్టి నిరర్ధకం. తెలివితో, యుక్తితో, సామర్ధ్యంతో జీవి తాన్ని ఆనందమయంగా నిర్మించుకొని, తీయని తలపుల్ని, దివ్యస్వరూపాల్ని అను భవంలోకి తెచ్చుకోవడమే పెద్దవరం. ఆ వరాన్ని సాధించడమే జీవితసాఫల్యం — అనిపిస్తోంది.

పాలివ్వని ఆవూ, కాయలు కాయని మొక్కా, ఆధారంలేని లత, పూజలేని మందిరం, వీటిబతుకూ, నిర్మాణం ఎందుకూ పనికి రానట్లే — ఆనందాన్ని, సుఖాన్ని, ప్రేమని, రసికతని అనుభవిస్తూ, బిడ్డ ఏడుపూ, చిరునవ్వులూ, ముద్దుమాటలూ, కేరింతలూ, మొదలైన వాటితో మాతృస్థా నాన్ని పొందలేని ఆడజన్మకూడా ఏమంత గొప్పదికాదేమో?

కాపరానికి వచ్చిన కొత్తల్లో నావేపు ఆయనగారు ఆశగా చూసినట్లే మాటలద్వారా మనసుని గిలిగింతలు పెట్టినట్లే శివరామా రావు చూస్తున్నాడు. బలమైన ఆ చేతులూ, కండలు తిరిగినవొళ్లూ, ఉబికిన వక్షస్థలం, గంభీరమైన మెడ, ఉద్రేక పడుతున్న పెదాలు, ఎరగా ఉపయోగించుకుంటూ నన్ను అతని దగ్గరికి లాక్కుంటున్నాయి.

అందమైన ఆ మొహాన్నీ, అతని నవ్వునీ వెలుగునీ, నల్లని ఉంగరాల క్రాపునీ, మరిచిపోవడం చేతకావడం లేదు.

నా ఆనందం కోసం, నాలోని మాతృ త్వం కోసం, ప్రకృతి ఏర్పరుస్తున్న పరి స్థితులకి లొంగిపోకుండా; ఎదురు తిరగడం శక్తికి మించిన పనైపోయింది. నిజంగా విధి — నా మాతృస్థానాన్ని శివరామారావు ద్వారా బైటపడవేసేట్లు కల్పిస్తుంది తప్పదు— ఈ అవకాశాన్ని ఏ విధంగానైనా కష్టపడి అనుభవించాలి. నా భవిష్యత్ జీవితంకోసం, మెల్లిగా నాటకమాడి ఆడబతుకు సార్ధకాన్ని- సంపాదించాలి.

ఏ మేమిటో బుర్రలో తిరుగుతున్నయ్. దేహమూ, మనసూ, ప్రాణమూ అన్ని శివ్‌కోసం ఆతృతపడుతున్నయ్.

పన్నెండయింది. వంటమనిషి భోజనం పెట్టి, హడావిడి — ఎక్కడికో వెళ్లి పోయింది. శివ్ కోసం చాలాసేపు ఎదురు చూసాను. మూడుగంటలు దాటినా అతను రాలేదు. ఆయనగారినుంచి ఉత్తరం వొచ్చింది. "అయిదురోజుల్లో బయల్దేరు తున్నాను." అని. ఇంకే సంగతులూలేవు.

ఎప్పుడు వొస్తే నాకేం? నా కోపం దిగులువడి ఆశగా పరుగెత్తుకువచ్చేవాడా? ఎందుకనో ఆయనగారి వుత్తరం జ్ఞాపకం తెచ్చుకుని నవ్వుకున్నాను.

గదిలోని పటాలూ, గడియారమూ, అద్దమూ నన్ను వెర్రిగా చూస్తున్నయ్. కిటికీ

లోంచి కొంచెం సేపు బైటికి చూసాను. దొడ్డంతా ఎంతో అందంగావుంది. ఏదో పాడుకుంటూ శివ్ లోపలికి వచ్చాడు.

"ఏం — యివాళ దొరగారికి ఆకలి వేయలేదా?"

నా మాట వినబడనట్లు సరిగ్గా కళ్ళల్లోకి చూశాడు. ఆ చూపుల బలమైనకాంతి, నా వొంట్లోకి గబగబా ప్రవేశించింది. నవ్వుతూ — ఎదురుగా వెళ్ళి కౌగలించుకున్నాను.

వొంపులు తిరిగి గ్లాస్కోపంచలోంచి నున్నగా కనబడుతూ, జారిపోతున్న ఆ చేతుల అందం కోసం, — ఆకళ్ళకాంతుల కోసం, నవ్వే ఆ పెదాలకోసం, సిగ్గుపడి తేతకానట్లు వూరుకోలేక పోయాను.

కిటికీలోంచివచ్చే, సాయంకాలపు వెలుతురు ఆ మొహంమీద మెరుగులు పెడుతోంది. అతని క్రాపుని, ఇటుఅటు సర్ది, మెత్తని ఆ చెంపల్ని ముద్దుగా తాకి, మెల్లిగా మంచం మీదికి లాక్కుపోయాను.

ఆ ముఖవైఖరి, కళ్ల, కొత్తగా, తమాషాగా, ఏదో ఇంకా బాధపడుతున్నట్లు, సిగ్గుపడుతున్నట్లుగావున్నయ్.

"మధ్యాహ్నం భోజనానికి రాలేదే?"

మాట్లాడలేదు.

"ఎందుకలా వెర్రిగాచూస్తావ్? పొద్దున్నే చెప్పకుండా వెళ్ళిపోయి యిప్పుడారావడం?"

నావేపు తమాషాగా చూశాడు. పొట్టలుపడిన ఆ బుగ్గలు మెల్లిగా నవ్వినట్లున్నాయి.

"రాత్రి నాటికను పూర్తిచేసావా?"

"లేదు. యింకొంచెం రాయాలి."

ఎంత మెత్తగా వున్నయ్ మాటలు!

"మరి, ఇవాళకూడా రాసుకుంటావా?"

కొంచెంసేపు నాకళ్ళల్లోకి చూసి "మన సంతాగంద్రగోళంగావుంది.రాయడానికి మన సుపోవడంలేదు. డైరెక్టరుగారికిచ్చిన మాటను నిలబెట్టుకోలేక పోతున్నాను" అన్నాడు.

ఏ వేవో ఆలోచనలతో, భావాలతో దూరంగా కలలో బతుకుతున్నట్లుగాక, ఆ కళ్ల కాంతులు మామూలుగానే ఉన్నయ్.

"మాటెందుకని పోగొట్టుకుంటావ్? వొంటరిగా కూచుని నాటికని పూర్తిచేయ్. నేను కిందికి వెళ్ళిపోతాను," అని గబగబా వచ్చేశాను.

ఆ సాయంకాలమంతా మనసెంతో ఉత్సాహంగావుంది. అతని ఎదురుగా వున్నంత సేపూ లోకమే స్వర్గంలా, తయారయింది.

ఏవేవో ఊహించుకుంటూ చీకటి పడేప్పటికల్లా, స్నానం చేసి — పైకి వెళ్లాను. నున్నని, మెత్తని శరీరకాంతి నీలం చీరె లోంచి దీపాలవెలుగుకి మెరుస్తోంది. తెల్లగా వున్న పొడుగాటి చేతులు జార్జెట్‌సిల్కు జాకెట్‌లోంచి, బైటికివచ్చి ఎంతో అందంగా వున్నయ్.

"స్నానం చేయలేదా శివరాం?" అన్నాను

"ఎందుకనో ఈ విషయం గుర్తుకు వస్తున్నకొద్దీ, భయంగావుంది" అన్నాడు.

"ఏం ?—"

"నామీద ఎంతో నమ్మకముంచి మద్రాసు వెళ్ళిన సుబ్బారావు గారిని గుర్తుకు తెచ్చుకుంటూ, నీతి నియమాలు లేకుండా వడవడం — భయంగావుంది."

నీతి, పాపపుణ్యాలు, స్వర్గం—నరకం, ఆలోచిస్తూ, బాధపడే మనిషి హృదయానికి యింకోటి కనపడదు. మెల్లిగా ఆ నమ్మకాల్లోంచి, వాసనల్లోంచి తప్పించుకొని సుఖపడేందుకు, తెలివినీ, శక్తినీ ఉపయోగించాలి. కండలు తిరిగి బలంతో ఉబికిన శరీరం, ఎత్తయిన భుజాలు, ఆ భుజాలకింద లైటువెలుగులో మెరుస్తూ చూసే చూపులు నావిగా చేసుకునేందుకు.' కష్టపడందే సుఖం దొరకదు' అనేమాట నిజమైంది." మెల్లిగా దగ్గరికి జరిగి, కాలర్ సర్దుతూ "నాకు 'నీతి'లో నమ్మకంలేదు. నీతనే పదానికి ఏ మాత్రం కూడా అర్థంలేదు. దాని కోసం నువ్వింతసేపు ఆలోచించాలా?" అన్నాను.

"ఆ .... ఆ ...."

"ఎందుకలా గాబరాపడతావ్? నీతనే దానికి పూర్వంనించీ విలువా, గౌరవంలేవు. ఆమాటల తాలూకు ప్రాముఖ్యంకూడా వాళ్లకు తెలీవు. సంస్కర్తలు, పెద్దలు వాళ్ళ అవసరం కొద్దీ, తమయిష్టాను సారంగా 'నీతి'కి ఎన్నోరకాల మెరుగుల్ని, వ్యాఖ్యానాల్ని సృష్టించారు. వాళ్ళమాట చెల్లుబడవుతున్నంత కాలం, నువ్వన్నట్లు ఆడది 'నీతి'గా బతుకుతున్నట్లు నటించాలి. ప్రవర్తించాలి. తప్పదు. కానీ, — మగవాళ్ళకి అవేమీ అవసరం లేదు."

"అయితే, మగవాడు నీతిగా బతకడం—"

"లేదు. నీతిగా బతికేట్లు మగవాడు కనీసం నిర్ణయించుకున్నప్పటికి ఈ సరికి ప్రపంచం తలకిందులై వుండేది. యిన్ని జైళ్ళు, కోర్టులూ—తగాదాలు వుండేవి కావు. మగవాడి హృదయం స్వార్థంతోనూ, కుళ్లుతోనూ నిండివుంటుంది గనుకనే — అది తారుమారవడానికి ఎక్కువసేపుపట్టదు. చూడరాదూ, ఆయనగారు ఏ విధంగా దూర దూరంగా తప్పుకు తిరుగుతున్నారో—"

"యిరవై సంవత్సరాల్నుంచీ ఆయనగారితో కాపరం చేస్తూ — సంసారంలోని కష్టసుఖాలు పంచుకుంటూ, వెన్నెల వెలుగులా సంచరించి అన్నీ తెలుసుకున్న మీరే, దాంపత్య ధర్మానికి, నీతికి విరుద్ధంగా నడవడం బావుండలేదు. మీ జీవితానికి కళంకాన్ని తెచ్చుకోవడం —"

"నీకన్నా నాకెక్కువ తెలుసు శివం. చేసిన యిరవైసంవత్సరాలకాపరాన్నీ మరిచిపోయి, నేను ఆయనగారిని వొదిలిపెట్టి. నేనాయన భార్యని కానట్లే అదంతా మరిచిపోయి, నీదగ్గరికి అంతకన్న ఎక్కువ ఆనందం కోసం, సంతోషం కోసం వచ్చాను. తన ఆనందం కోసం, సుఖంకోసం, పెద్దలవల్ల నూరిపోయబడిన నీతి, మాటల్నితోసి — ఆయనగారు ఎక్కడెక్కడో తిరుగుతూ, నమ్మినవారిని మోసం చేస్తూ తన అల్పత్వాన్ని బైటపెట్టుకున్నప్పుడు, నేనింకా ఆ 'పాత'మాటల్ని, సిద్ధాంతాల్ని పాకులాడుతూ కూర్చోనా? నువనేట్లు 'నీతికి' విలువా, గొప్పతనమూ వుండేట్లయితే — అది యిద్దరికీ అవసరంలేదా?"

"మగవాడు ఎలాతిరిగినా, బతికినా లోకం పట్టించుకోదు. నీతికి మగవాడు కట్టుబడి వుండాలని —"

"అవును నేను చెప్పినా లాభంలేదు. నీ సిద్ధాంతం ప్రకారం నీతనేది చాలా మంచి

విషయమూ, గొప్పసంగతీ కావొచ్చు. కానీ,—కోరికా, వాంఛా, మనసూ, ప్రేమా-మొదలైన వాటికి అడ్డుగా నిలబడి అవరోధాన్నేర్పరిచే నీతిమీద, ఏ మాత్రంకూడా యిష్టం కనపరచదు ఆడది. అక్కడే సాధారణమైన పెద్దలకి ఆడవాళ్ళమీద కోపం వస్తుంది. యిదంతా దేనికి? నిన్ను చూసిన మొదటిరోజునే నా మనసు నీ చుట్టూ తిరిగింది. ఆ ఆకర్షణనించి తప్పుకోవడం చేత కాలేదు. ఏదో వెలితితో బాధపడుతున్న కోర్కెని, నీద్వారా పొందమని విధి నిన్ను నా దగ్గరికి పంపిందని నమ్మి — ప్రేమించాను. నీవల్ల నా కోర్కెలకి రూపం ఏర్పడదంచాలు. నా కదే ఆనందం. నీతని నమ్మి—నా కోర్కెని నాశనం చేసుకోను. నా భావనలకి రూపం ఏర్పడడం కోసం, జీవితం కళంకితం కావడమేకాదు. ఆ ప్రయత్నంలో నాశనమయి పోయినా నేను దిగులు పడను"

శివరామారావేమీ మాట్లాడలేదు.

కొబ్బరిచెట్ల నీడల వెనకనించి ఉదయిస్తున్నాడు బంగారు చంద్రుడు. దొడ్లో, వరండాలో మెత్తని వెన్నెల పడుతోంది. కావేరినది మీదినించి కమ్మనిగాలి వస్తోంది. రోడ్డుమీది ఎలక్ట్రిక్ లైట్లు వెలుగుతున్నాయి. ముందుకు వాలిపోయాను. బలంగా, వేడిగా నింపివేశాయి నా పెదవులు అతనిపెదవుల్ని. అదుర్దాగా రెండుచేతులూ, నా వీపుచుట్టూ పోనిచ్చి ఆ గుండెల దగ్గరికి_గట్టిగాలాక్కున్నాడు.

అందం, సుఖం, కీర్తి, హోదా, ధనం, చక్కని స్త్రీ అవసరం లేని మనిషి ప్రపంచంలో వుంటాడా?

"నీలంరంగు చీర, జార్జెట్ నీ బ్లౌజాకెట్, తెల్లనిమెడ, ముత్యాలహారం, ధగ ధగ మెరిసే వొళ్లూ, నొక్కు నొక్కుల జుట్టు, ఎర్రని పెదాలు....నా జీవితానికి వెలుగుల్ని ప్రసాదించినయ్." అన్నాడు.

ఇన్నాళ్ళూలేని సిగ్గు వేసింది. తలవొంచుకున్నాను.

నా మొహం తనవేపుకి తిప్పుకుని, తన కళ్ళల్లోకి నా కళ్ళను తిప్పుకున్నాడు. అతని వెనక పెద్దనీడ. మొహం మీద ఎలక్ట్రిక్ దీపం వెలుగు.—దగ్గరికి లాక్కుంటూ గిలిగింతలు పెడుతున్న చేతులు....పరవశత్వం కలిగింది. నా కంతకన్న ఏం కావాలి? అందమయిన వాడు, చదువుకున్న వాడు, యువకుడు!

నా మెడని వెనక్కు వంచి, తన మొహాన్ని నామీదికి వొంచాడు. నన్ను నేనే మరిచి పోయాను. మెల్లిగా చంపల్ని నిమురుతూ ఒక్క సారిగా పక్కమీదకి తోసేసి వెళ్ళిపోయాడు చప్పుడు కాకుండా.

# 8

వారం రోజులు గడిచినయ్. ఆశల్ని రేపుతూ — ఉద్రేకాన్ని రెచ్చగొడుతూ, నవ్విస్తూ, గిలిగింతలు పెడుతూ, కోరికల్ని బలపరుస్తూ, ఈ వారంరోజులూ దూరదూరంగా తిరిగాడు.

మొదట్నుంచీ అతను ప్రత్యేకమయిన వాడని నాకు తెలుసు. ఆ ముదపు దీపంలోని వొత్తిని ఎగదోసేందుకు చీపురు పుల్ల ఏ విధంగా కావాలో, — శివ్‌ని రెచ్చగొట్టేందుకు నాలాంటి స్త్రీ లేందే వుద్రేకపడడని

గ్రహించాను. అలాంటి మగవాణ్ని జన్మలో కలుసుకోవడంకూడా గొప్ప అదృష్టం!

ఆ బట్టలమీదినించివచ్చే సెంట్ వాసనా, మెత్తగా దూదికిమల్లే నా కళ్ళల్లో తగులుకుని సాగే అతని క్రాపూ, నా పెదవులు తగలడంతోనే ఆ చెంపలు తళతళ మెరవడం, ఎత్తయిన ఆ ఛాతీమీద నాతల పెట్టడంతోనే కితకితలు పెట్టినట్టు అతను నవ్వడం, వేడిగా తగిలే అతని వూపిరీ, మెరుస్తుండే నాజూకైన శరీరం, బలమయిన చేతులూ, అతణ్ని చూస్తున్నకొద్దీ ఏవేవో కోరికల్ని రేపేవి! ఆ చేతుల్లో నలగాలని, అనుభవించాలని, నా కోరికలకి 'రూపం' ఏర్పరుచు కోవాలని భ్రమకలిగేది! కాని,—ఉద్రేకపడుతున్నకొద్దీ, కోరికల్ని నింపు కానేకొద్దీ, తప్పుకు తప్పుకు తిరగడం — రాత్రులు ఇంటికి రాకపోవడం సాగించాడు.

ఏవేవో ఆలోచిస్తూ కూర్చున్నాను. పదకొండు గంటలు వినిపించింది. ఆయనగారు — 'మెయిల్లో వస్తున్నా'నని రాశిన కార్డును యిచ్చి వెళ్లాడు జవాను.

దాదాపు ఇరవైరోజులు కావొచ్చింది ఆయనగారు వెళ్ళి. ప్రతిసారీ, ఆపననీ, ఈపననీ సాకుతో మద్రాసును వొదిలి పెట్టలేక, రేపటి మెయిలుకి ఉదయానికల్లా యింటికి వస్తున్నారు. యింకో వారంరోజుల పాటు ఏదన్నా అవసరమయిన పనివల్ల ఆగిపోతే బావుండును!

తగినట్టు శివరామారావుకూడా రాత్రులు యింటికి రాకుండా, ఎక్కడెక్కడో తిరిగి, ఏవేవో వంకలతో తప్పుకు తిరగడం నేర్చుకున్నాడు. ఆశలు, వాంఛలు, కోరికలు, అలానే నిలిచిపోయినయ్ గాని, ఆ కోరికలకి రూపం ఏర్పడడం అటుంచి—ఆ వాసనలనుంచి, ఆ ఆలోచనలనుంచి తప్పుకోలేక పోతున్నాను.

ఎదురుగావున్న అద్దంలోని ప్రతిబింబం ఎంతో ముచ్చటగావుంది. ఆత్రుతపడుతున్న హృదయానికి కిటికీలోంచి వచ్చేగాలి తృప్తిని కలిగించలేక పోతోంది. ఏదన్నా చదువుకునేందుకు పుస్తకం తీసుకుందామని శివ్. టేబిలు సొరుగు లాగాను.

ఓ పక్క చిన్న మాత్రల సీసా, మందుల కేట్లాగూ, ఓ ఉత్తరం కనిపించినయ్. బైటికి తీసి చూశాను.

"మీ ఆర్డరు ప్రకారం వి. పి. ద్వారా కామకేళి మాత్రలు పంపుతున్నాము. ప్రతి ఉదయం, సాయంకాలం మాత్రతోపాటు పాలను తాగండి. సృష్టికార్యానికి ఉద్రేకపడేందుకు ఉపయోగించే 'తైలం' వారంరోజులపాటు ఉపయోగించండి. స్త్రీ పట్ల మీకున్న విముఖత్వం పోయి, నరాల పటుత్వం హెచ్చి, స్త్రీ తాలూకు సుఖాన్ని, ఆనందాన్ని పొందుతారు!"

ఒక్కసారి వొళ్లు గగుర్పొడిచింది. ఇంతవరకూ వూహిస్తూ, ఆలోచిస్తూ — ఆనందపడుతున్న కోర్కెలు, వాంఛలు కళ్లముందే హారతికర్పూరంలా హరించిపోయినట్లు, దిగులు, గుబులు, హృదయం నిండా అలుముకు పోయింది.

**ఐ పో యిం ది.**